PRAJA SANKALPAM ఆదివారం, 22 నవంబరు 2026 ప్రజా సంకల్పం 4

సర్పంచ్ అభ్యర్థి కిడ్నాప్

- ఓటమి భయంతో టీడీపీ నేతల దౌర్జన్యం



శ్రీసత్యసాయి జిల్లా: అమదగూరు మండలం మహమ్మదాబాద్‌లో వైయస్ఆర్‌సీపీ మద్దతుతో సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన పాల శ్రీనివాసులు కిడ్నాప్‌కు గురయ్యారని వైయస్ఆర్‌సీపీ నేతలు ఆరోపించారు.నామినేషన్ ఉపసంహరించుకోవాలంటూ బెదిరింపులు చేసినా ఆయన వెనక్కి తగ్గకపోవడంతో ఈ ఘటనకు పాల్పడ్డారని పేర్కొన్నారు.

రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న శ్రీనివాసులను అర్ధరాత్రి 12 గంటల సమయంలో కొందరు వ్యక్తులు ఇంటికి వచ్చి ఆయన భార్య ఈశ్వరమ్మ ఎదుటే బలవంతంగా తీసుకెళ్లారని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వైయస్ఆర్‌సీపీ పట్టపర్తి నియోజకవర్గ సమన్వయకర్త దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి మహమ్మదాబాద్‌కు వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రజల నుంచి వస్తున్న స్పందనను చూసి ఓర్వలేకే టీడీపీ నేతలు కుట్రలకు పాల్పడుతున్నారని దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. పల్లె రఘునాథరెడ్డికి ధైర్యం ఉంటే ప్రజాక్షేత్రంలో తేల్చుకోవాలని సవాల్ చేశారు. కిడ్నాప్‌కు గురైన అభ్యర్థి భార్య ఈశ్వరమ్మను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని వైయస్ఆర్‌సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

ఏలూరులో స్వర్ణలతపై దాడి అమానుషం

- దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి
- వైయస్సార్‌సీపీ అధికార ప్రతినిధి నాగమల్లీశ్వరి డిమాండ్



తాడేపల్లి: రాష్ట్రంలో మహిళలకు రక్షణ కల్పించాల్సిన కూటమి ప్రభుత్వం, మహిళలను భయభ్రాంతులకు గురిచేస్తూ దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతోందని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి నాగమల్లీశ్వరి తీవ్రస్థాయిలో విమర్శించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న దాడులను ప్రశ్నిస్తే బాధితులపైనే కేసులు నమోదు చేస్తున్నారని, ఇదేనా మహిళలకు కల్పిస్తున్న రక్షణ అని ప్రభుత్వాన్ని నిలదీశారు. ఏలూరులో సామాజిక కార్యకర్త నిట్టా స్వర్ణలతపై జరిగిన దాడి ఘటన ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు.స్వర్ణలతకు వైయస్సార్‌సీపీ అండగా ఉంటుందని, ఆమెకు న్యాయం జరిగే వరకు బాధితురాలి పక్షాన నిలబడతామని నాగమల్లీశ్వరి స్పష్టం చేశారు.

ఆమె ఇంకా ఏమన్నారంటే...

ప్రశ్నించినందుకే దాడి:

ప్రజలకు జరుగుతున్న అన్యాయాలను నిలదీసినందుకే స్వర్ణలతపై దాడికి పాల్పడ్డారు. ఏలూరులో గత 30 నెలలుగా జరుగుతున్న దౌర్జన్యాలు, దందాలు, అక్రమ వసూళ్ల గురించి స్వర్ణలత 22 పేజీల ఫిర్యాదులో వివరించారు.

డిప్యూటీ మేయర్ పదవిలో కొనసాగాలంటే రూ.10 లక్షలు ఇవ్వాలంటున్నారు. మద్యం దుకాణాల నుంచి ఒక్కో షాపుకు రూ.5 లక్షలు వసూలు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా ప్రశ్నించకూడదా? పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదులు చేసినా న్యాయం జరగకపోగా, బాధితురాలిపైనే పది కేసులు నమోదు చేయడం దారుణం. పోలీసుల కళ్ల ముందే దాడి జరుగుతున్నా అడ్డుకోలేని పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలో సోషల్ యాక్టివిస్టులుగా, ప్రజా సమస్యలపై ప్రశ్నించే మహిళలుగా ముందుకొస్తున్న ఆడబిడ్డలకు రక్షణ కరువైంది. మహిళలపై దాడులు జరుగుతున్నా మహిళా కమిషన్ స్పందించకపోవడం దారుణం. రెడ్‌బుక్ పేరుతో మహిళలను భయభ్రాంతులకు గురిచేసే రాజకీయాలకు స్వస్తి చెప్పాలి. స్వర్ణలతకు తక్షణమే పోలీసు రక్షణ కల్పించాలి. ఆమె ఇచ్చిన ఫిర్యాదులపై కేసులు నమోదు చేసి, దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలని నాగమల్లీశ్వరి స్పష్టం చేశారు.

ఎన్నికల్లో అరాచకాలను అడ్డుకోవాల్సిన

బాధ్యత జిల్లా యంత్రాంగానిదే

- వైయస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి



వైయస్ఆర్ జిల్లా: వేంపల్లిలో వైయస్ఆర్‌సీపీ మద్దతుతో సర్పంచ్ అభ్యర్థిగా బరిలో ఉన్న షబ్బీర్‌కు మద్దతుగా వైయస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఎన్నికలను సక్రమంగా, ప్రశాంతంగా నిర్వహించాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగంపై ఉందని పేర్కొన్నారు.

లోకేష్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందని, పోలీసులు, రౌడీలు, అధికారులను అడ్డం పెట్టుకుని ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడుతున్నారని సతీష్‌రెడ్డి మండిపడ్డారు. వైయస్ఆర్‌సీపీ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడంతో పాటు గ్రామాల్లో ఓటు వేసేందుకు వెళ్తున్న ప్రజలను కూడా అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు.

కూటమి నాయకుల అరాచకాలను అధికారులు, పోలీసులు మౌనంగా చూస్తే రాష్ట్రంలో శాంతిభద్రతలు మరింత దిగజారుతాయని హెచ్చరించారు. అవినీతి అధికారుల వల్ల ప్రజలకు రక్షణ లేకుండా పోయిందని, ఎన్నికల్లో అరాచక శక్తులను ప్రజలు తమ ఓటుతో తరిమికొట్టాలని సతీష్‌రెడ్డి పిలుపునిచ్చారు.వైఎస్ జగన్ వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేందుకు టీడీపీ సోషల్ మీడియా, ఎల్లో మీడియా చేస్తున్న ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. చంద్రబాబు, లోకేష్ రాష్ట్రంలో అరాచక శక్తులుగా మారారని ఘాటుగా వ్యాఖ్యానించారు.

స్థానిక ఎన్నికల వేళ టీడీపీ అరాచకాలు

- వైయస్ఆర్‌సీపీ నేతలు, అభ్యర్థులపై దాడులు.. నామినేషన్లకు అడ్డంకులు



ఏలూరు జిల్లా: వేలేరుపాడులో ఎన్నికల ప్రచారం ముగింపు సమయంలో వైయస్ఆర్‌సీపీ నేత శ్రీనివాస్‌గౌడ్ వాహనాన్ని అడ్డగించి టీడీపీ వర్గీయులు దాడికి పాల్పడ్డారు.ఆయనకు చెందిన ఆస్పత్రిపై కూడా రాళ్లతో దాడి చేశారు.

ఏలూరులో టీడీపీ అక్రమాలను ప్రశ్నించిన అడ్వకేట్ స్వర్ణలతపై దాడి జరిగిందని ఆమె పేర్కొన్నారు. తనపై పిడిగుద్దులు గుద్దడంతో పాటు జుట్టు పట్టుకుని ఈడ్చారని, గతంలోనూ తనపై దాడులు జరిగినా చర్యలు తీసుకోలేదని తెలిపారు.

వైయస్ఆర్ జిల్లాలోని ఖాజీపేట మండలం చెంబులపల్లె క్లస్టర్‌లో నామినేషన్ తిరస్కరణకు కారణం అడిగిన వైయస్ఆర్‌సీపీ మద్దతుదారులపై ఆర్వో ఎదుటే టీడీపీ వర్గీయులు దాడికి పాల్పడ్డారు.

శ్రీసత్యసాయి జిల్లా కదిరిలో ఓటమిని జీర్ణించుకోలేక వైయస్ఆర్‌సీపీ నేతలపై టీడీపీ వర్గీయులు దాడి చేశారని, ఇద్దరు నేతలు తీవ్రంగా గాయపడ్డారు. అనంతరం 19 మంది వైయస్ఆర్‌సీపీ నేతలపై కేసులు నమోదు చేసి, కౌన్సిలర్ సహా తొమ్మిది మందిని రిమాండ్‌కు తరలించారు.

తిరుపతి జిల్లా పాకాల మండలం ఉప్పరపల్లిలో మెజారిటీ ఉన్న వైయస్ఆర్‌సీపీ అభ్యర్థులను కాదని ఉపసర్పంచ్ పదవి టీడీపీకేనంటూ టీడీపీ వర్గీయులు బెదిరింపులకు పాల్పడ్డారని వైయస్ఆర్‌సీపీ వర్గాలు పేర్కొన్నాయి.

గురజాలలోకొన్ని నామినేషన్లను తిరస్కరించడంపై అప్పీల్ చేసేందుకు ఆర్డీవో కార్యాలయానికి వెళ్లిన వైయస్ఆర్‌సీపీ మద్దతుదారులను పోలీసులు అడ్డుకున్నారు. కోర్టు ఆదేశాలతో నామినేషన్ ప్రక్రియకు అవకాశం వచ్చినప్పటికీ అధికారులు స్పందించకపోవడంతో అభ్యర్థులు ఆందోళనకు దిగారు.

బండి ఆత్మకూరులో టీడీపీకి షాక్!

- వైయస్ఆర్‌సీపీలోకి 50 కుటుంబాలు



నంద్యాల జిల్లా: శ్రీశైలం నియోజకవర్గం బండి ఆత్మకూరు మండలం ఏ.కోటూరు గ్రామంలో టీడీపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీకి చెందిన కీలక నేతలు, 50 కుటుంబాలు టీడీపీని వీడి వైయస్ఆర్‌సీపీలో చేరారు. శ్రీశైలం నియోజకవర్గమాజీఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డిసమక్షంలోనంద్యాల పద్మావతినగర్‌లోని వైయస్ఆర్‌సీపీ కార్యాలయంలో వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. మాజీ సాగునీటి సంఘం అధ్యక్షుడు వడ్డు వెంకటరెడ్డి, ఏ.కోటూరు సొసైటీ సింగిల్ విండో చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డితో పాటు చాగంటి రామేశ్వరరెడ్డి, చాగంటి నాగేశ్వరరెడ్డి, వడ్డు నాగిరెడ్డి, వడ్డు ప్రతాప్‌రెడ్డి, జమాల్‌బాషా, చెన్నయ్య, సుబ్బు, ఎం.వెంకటేశ్వర్లు తదితరులు వైయస్ఆర్‌సీపీలో చేరారు. టీడీపీ విధానాలు నచ్చకనే ఆ పార్టీ పదవులకు రాజీనామా చేసి వైయస్ఆర్‌సీపీలో చేరుతున్నట్లు వారు తెలిపారు.సాగునీరు అందుబాటులో ఉన్నప్పటికీ రైతులకు సకాలంలో నీరు అందక ఇబ్బందులు పడుతున్నారని వారు పేర్కొన్నారు. శిల్పా చక్రపాణిరెడ్డి నాయకత్వంలో పనిచేసేందుకు నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు.

Social Buzz







